క్లుప్తంగా

పీఏసీఎస్ అధ్యక్షుడిగా శాంతన్న



ఉయ్యాల శాంతన్న

మద్దికెర: మండల వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉయ్యాల శాంతన్న ఎంపిక య్యారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల ఆయన ఆదివారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన బురుజుల వీరశేఖర్, మద్దికెరకు చెందిన బత్తిని హరిప్రసాద్‌ను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారని, అందరి సహకారంతో సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



దేవరగట్టులో ప్రత్యేక అలంకరణలో మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టు క్షేత్రంలో వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని విరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలో రుద్రాభిషేకంతో పాటు మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాళమల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు మోకాళ్లతో మెట్లను ఎక్కుతూ వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయంలో పూజారులు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న పత్తికొండ ఎస్‌ఐ గోపాల్

పత్తికొండ రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పత్తికొండ ఎస్‌ఐ గోపాల్ సూచించారు. ఆదివారం స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌ఐ గోపాల్ జ్యోతిప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడేలా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. మెడికల్ క్యాంపులో కిమ్స్ హాస్పిటల్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రామ్మోహన్, సీనియర్ వైద్యుడు సుబ్రమణ్యం, బీజేపీ మండలాధ్యక్షుడు శంకరయ్యాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర కాదది.. తోపుడు యాత్ర

కృష్ణగిరి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర కాస్త తోపుడు యాత్రగా మారిందని నేషనల్ నవక్రాంతి పార్టీ పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వాల్మీకి పెద్దయ్య అన్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మార్లెల్లలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో లోకేశ్‌ను కలిసి సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లగా తనను తోసేశారన్నారు. ఎంతో మందికి ఇలాంటి అనుభవం ఎదురైందన్నారు. ఎవరైనా పాదయాత్ర చేస్తే ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు చేస్తారు కానీ, ప్రజలను తోసేసుకుంటూ లోకేశ్ పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

సాగునీటి తీరువా చెల్లించండి

హొళగుంద: మండలంలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), సాగునీటి చెరువుల కింద ఆయకట్టు భూములు కలిగిన రైతులు ప్రభుత్వానికి నీటి తీరువా (సెస్సు) చెల్లించాలని తహసీల్దారు హుసేన్‌సాహేబ్ కోరారు. మండలంలో దాదాపు ఆరు వేల ఎకరాల ఆయకట్టు భూమి ఉందని, 1432 ఫసలి వరకు బకాయి ఉన్న సెస్సు చెల్లించాలన్నారు. దాదాపు రూ.కోటి వరకు బకాయిలు ఉన్నాయని, రైతులు సొమ్ము చెల్లిస్తే ప్రభుత్వ ఖజానాకు నగదు చేరి అభివృద్ధి పనులకు ఉపయోగించుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. వీఆర్‌ఓలు బకాయి వసూళ్లను వేగవంతం చేయాలని అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం విక్రేత అరెస్ట్

హొళగుంద: మండల కేంద్రంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ ఆదివారం రాత్రి విలేకరులకు తెలిపారు. స్థానిక సినిమా టాకీస్ ఏరియాలో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తుండగా నిందితుడిని అరెస్ట్ చేసి 20 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నాటి హామీలు ఏమయ్యాయి చినబాబు?

- గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు లోకేష్‌కు గుర్తున్నాయా?
- జింకల పార్కు, టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఎక్కడ?
- హంద్రీ–నీవా నుంచి ఒక్క చెరువుకైనా నీరిచ్చారా?
- అధికారంలో ఉండి నగరడోణ రిజర్వాయర్ ఊసెత్తని బాబు
- మూడున్నరేళ్లలో అభివృద్ధి చేసి చూపిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం





వైఎస్సార్‌సీపీ హయాంలో శరవేగంగా జరుగుతున్న నగరడోణ రిజర్వాయర్ పనులు

ఆలూరు రూరల్: గతంలో 2014–2019 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు ఆలూరు నియోజకవర్గానికి చేసింది శూన్యం. ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. 2013లో వస్తున్నా మీకోసం పాదయాత్రలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను తర్వాత ఐదేళ్లు అధికారంలో ఉన్నా అమలు చేయకుండా విస్మరించారు. ప్రస్తుతం చంద్రబాబు తనయుడు లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆలూరు నియోజకవర్గంలోకి ప్రవేశించనుండడంతో నాడు తండ్రి ఇచ్చిన హామీలను ప్రజలు నెమరు వేసుకుంటున్నారు.

వైఎస్ హయాంలోనే నగరడోన శంకుస్థాపన

2007లో దివంగత నేత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిప్పగిరి మండలంలో నగరడోణ రిజర్వాయర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయించారు. అప్పట్లో రూ.18 కోట్లతో 0.104 టీఎంసీల నీటి సామర్థ్యంతో 4,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రిజర్వాయర్ నిర్మాణానికి పూనుకున్నారు. ప్రభుత్వ ధరతో భూములు కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు కూడా జమ చేశారు. వైఎస్సార్ మరణానంతరం ఆ పనులు నిలిచిపోయాయి. 2013లో 'వస్తున్నా మీకోసం' పాదయాత్రలో చిప్పగిరి మండల రైతులు చంద్రబాబుకు విన్నవించగా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రిజర్వాయర్ నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత అధికారం చేపట్టినా ఐదేళ్లలో చేసిందేమీ లేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రీటెండరింగ్ ద్వారా రూ.56 కోట్లతో నగరడోణ రిజర్వాయర్ పనులు చేపట్టి ప్రస్తుతం 75 శాతం వరకు పనులు పూర్తి చేశారు.

2013లో చంద్రబాబు పాదయాత్రలో రైతుల వినతి మేరకు హొళగుంద మండలంలోని దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేస్తానని, రైతులు పంట పొలాలను రక్షించుకునేందుకు కంచె ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుదని ఇచ్చిన హామీ కలగానే మిగిలిపోయింది. అలాగే ఆలూరులో టెక్స్‌టైల్ పరిశ్రమ, ఆస్పరిలో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ వంటి హామీలను ఇప్పటికీ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. 2016లో రైతులకు స్ప్రింక్లర్లు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి హోదాలో ఆలూరు మండలం అరికెర గ్రామ సమీపంలో ప్రారంభోత్సవ సభకు వచ్చిన చంద్రబాబు నియోజకవర్గంలోని చెరువులను హంద్రీ–నీవా నుంచి ఎత్తిపోతల ద్వారా నింపుతామని రైతులకు గట్టిగా హామీ ఇచ్చి తర్వాత ఐదేళ్ల పాలనలో నీటిని ఎత్తింది లేదు.. చెరువుల్లో పోసింది లేదని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత హాలహర్వి మండలంలోని గూళ్యం సమీపంలో వేదావతి నది కోసం రూ.18.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయి. నారా లోకేష్ పాదయాత్రలో తండ్రి గతంలో ఇచ్చిన హామీలపై మాట్లాడుతారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. టీడీపీ పాలనలో ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నీరు చెట్టు కింద చెరువులు అభివృద్ధి చేస్తామని కోట్లాది రూపాయలు విడుదలు చేసినా.. జన్మభూమి కమిటీలకు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు జేబులు నింపుకోవడానికి తప్పా రైతులకు, ప్రజలకు ఉపయోగపడలేదు.

అభివృద్ధి చేసి చూపిన వైఎస్సార్‌సీపీ

గత ఐదేళ్లలో టీడీపీ చేయని అభివృద్ధిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడేళ్లలో చేసి చూపించారు.

- ఆలూరు మండలం మొలగవల్లిలో రూ.1.85 కోట్లు ఆర్‌అండ్‌బీ నిధులతో నూతన పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆరు నెలల కాలంలో పూర్తి చేయించారు.
- కమ్మరచేడు గ్రామంలో పీహెచ్‌సీ, హాలహర్విలో పీహెచ్‌సీ, అర్థగేరి గ్రామంలో పీహెచ్‌సీ కేంద్రాలను రూ.1.89 కోట్లతో ఆధునికీకరించి పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేశారు.
- ఆలూరు సీహెచ్‌సీలో రూ.1.86 కోట్లతో నూతన ఆస్పత్రి భవనం నిర్మించారు.
- నియోజకవర్గంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద మండలాల్లో రూ.వందల కోట్లు ఖర్చు పెట్టి నూతన రోడ్లు నిర్మించారు.



రామదుర్గం నుంచి చిప్పగిరి వరకు పూర్తిచేసిన రహదారి



మొలగవల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం

- హొళగుంద–ధనాపురం వరకు రూ.59.25 కోట్లతో 27 కిలోమీటర్ల రోడ్డు, అదే మండలంలోని ఇంగళదహాళ్–హెబ్బటం గ్రామానికి రూ.1.65 కోట్లతో 3 కి.మీ రోడ్డు పూర్తి చేయించారు.
- చిప్పగిరి మండలంలోని రామదుర్గం నుంచి చిప్పగిరి వరకు రూ.12.8 కోట్లతో 8 కి.మీ రహదారి ఏర్పాటు చేశారు.

గోశాలకు విరాళం

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్య స్వామి దేవాలయానికి చెందిన గోశాలకు ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన బండారు విజయుడు రూ.20 వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతకు స్వామి వారి జ్ఞాపికను అందజేశారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

మద్దికెర: పదో తరగతి పూర్తయి పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌కు పరీక్ష రాయాలనుకునే విద్యార్థులకు ఆపద్బంధు సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు చొక్కా సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 18 నుంచి ఈఏపీసెట్, పాలిసెట్ కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు గుంతకల్లులోని ఇండియన్ బ్యాంకు వద్ద ఉన్న గౌతమి స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు 82474 52174, 90104 61033 నంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర: మద్దికెర పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేందుకు అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సర్పంచ్ సుహాసిని, ఈఓ శ్రీహరి ఆదివారం తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో వీధిలైట్లు, లైట్లు మరమ్మతు చేయుట, నీటి పథకాలకు సంబంధించి మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, రిపేరీ చేయడం వంటి వాటిలో వృత్తి ప్రావీణ్యం కలిగిన వారు ఈనెల 17వ తేదీ లోపు గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలి

ఎమ్మిగనూరురూరల్: వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని వాల్మీకి సంఘం నాయకులు డాక్టర్ పార్థసారథి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం మండలం పరిధిలోని దైవందిన్నె గ్రామంలో.. వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ల సాధనపై నిరసన ర్యాలీని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్ సాధనకు గ్రామస్థాయి నుంచి వాల్మీకులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వాల్మీకి సంఘం నాయకులు వీజీఆర్ కొండయ్య, చిన్న ఈరన్న, యాపిలయ్య, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకులం ప్రవేశపరీక్ష



వెల్దుర్తిలో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది

వెల్దుర్తి: మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ఆర్‌కే రోడ్డులో గల జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులం పరీక్ష కేంద్రంగా జరిగిన ఈ పరీక్షకు జిల్లాలోని 431 మంది దరఖాస్తు చేసుకోగా 35 మంది గైర్హాజరైనట్లు సూపరింటెండెంట్ షబానా బేగం తెలిపారు. నిర్వాహకులు క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్ను, హాల్ టికెట్, గుర్తింపు కార్డులతో మాత్రమే విద్యార్థులను పరీక్షకు అనుమతించారు. ఆరుగురు చిన్నారుల వద్ద హాల్‌టికెట్ లేకపోగా నలుగురు దరఖాస్తు సమయంలోని అక్నాలెడ్జ్ కార్డుతో హాజరయ్యారు. మరో ఇద్దరు ఆన్‌లైన్ సమస్య కారణంగా అక్నాలెడ్జ్‌మెంట్ కార్డు సైతం పొందలేక పరీక్ష రాయలేకపోయారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు, పోలీసులు తమ బాధ్యతలు నిర్వహించారు.

'సంక్షేమం'లో దేశానికే ఆదర్శం



వెంకటగిరిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని వెంకటగిరి, చెన్నాపురం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని, నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నారని వివరించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను తూచతప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పాలన చేరువ చేశారని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాల పంపిణీ, నిర్మాణానికి సహకారం, కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. నాడు–నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని, విద్య, వైద్య రంగానికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథాకాలు అందిస్తున్నట్లు కొనియాడారు. వెంకటగిరి–కందనాతి గ్రామాల మధ్య రహదారి నిర్మాణం పూర్తి చేయిస్తానని, అలాగే గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్.బసిరెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బుడ్డన్న, తిక్కయ్య, శివారెడ్డి, తాయన్న, పెద్దయ్య, చెన్నాపురం ఎంపీటీసీ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కనకవీడులో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి

నందవరం: పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఆ పార్టీ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. ఆదివారం కనకవీడు గ్రామంలో ఎంపీటీసీలు, పార్టీ అధికార ప్రతినిధులు, గృహ సారథులు, వలంటీర్ల ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరత్నాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల జీవితాల్లో నవకాంతులను నింపారన్నారు. మారోమారు సీఎం జగనన్నకు అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. ప్రతి ఇంటా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ, గత టీడీపీ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ, టోల్ ఫ్రీ 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని వినిపించారు. అనంతరం ఇంటి గుమ్మాలకు స్టిక్కర్లు అతికించారు. వైస్ ఎంపీపీ షేక్‌సాహెబ్, ఎంపీటీసీ సుశీలమ్మ, జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు పాల్గొన్నారు.

గోనెగండ్ల: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారిని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించాలని గృహసారథుల మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గోనెగండ్ల, పుట్టపాశం, పెద్దనేలటూర్, పెద్దమరివీడు తదితర గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం చేపట్టారు.నాయకులు నరసన్న ఆచారి, నాగేష్, లోకేష్, అల్లబకాష్, నాయుడు, గంగాధర్, వల్లబుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రచారభేరి

నందవరం: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్ డిమాండ్ చేశాడు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామ పక్షాలు (సీపీఐ, సీపీఎం) తలపెట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని గురజాల, రాయచోటి గ్రామాల్లో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం పేదలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తోందని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ, కార్మిక, కర్షక, రైతులపై గుదిబండ మోపుతుందన్నారు. ప్రభుత్వ సంస్థలను నిరీర్యం చేస్తూ.. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న మోదీ సర్కార్‌ను గద్దె దింపాలని పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం నాయకులు గిడ్డయ్య, సోమేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, శాంతప్ప, ఎల్లేష్, స్వామిదాసు, దేవపుత్ర తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్షాలు నిర్వహిస్తున్న ప్రచారభేరి కొనసాగుతోంది. ఆదివారం మండల కేంద్రంలో పాతబస్టాండు, మార్కెట్ ఏరియాలలోని ప్రజలకు సీపీఐ, సీపీఎం నాయకులు టి.కృష్ణ, నగేశ్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ ప్రతినిధులు మాధవస్వామి, గిరిబాబు, చిన్నమాదులు తదితరులు కరపత్రాలు అందిస్తూ, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనను వివరించారు. సీపీఐ, సీపీఎం నాయకులు, అనుబంధ సీఐటీయూ, హమాలీ వర్కర్స్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన' కార్యక్రమం

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

వైభవంగా తిమ్మగురుడి రథోత్సవం

గూడూరు: పట్టణంలో తిమ్మగురుడి స్వామి బ్రహ్మోత్సవాల్లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి రథోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామి ఉత్సవ విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజల చేశారు. తర్వాత రథంపై ఆశీనులు చేసి అశేష భక్త జనం మధ్య రథోత్సవం నిర్వహించారు. భక్తులు జై తిమ్మగురుడు స్వామి అంటూ నినాదాలు చేశారు. ఆలయ ఈఓ గురురెడ్డి, వీఆర్వో తిమ్మన్న, కోడుమూరు సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో గూడూరు, సి.బెళగల్, కోడుమూరు ఎస్‌ఐలు నరేంద్ర, పీరయ్య, శ్రీనివాసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

గ్యాస్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని అర్బన్ : గ్యాస్ ప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక కేంద్ర అధికారి యేసురత్నం తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎస్కేడీ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో మహిళలకు గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ నుంచి మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పివేయాలని ప్రదర్శన ద్వారా వివరించారు. గ్యాస్ లీక్ అయ్యిందని తెలిసినప్పుడు ఇంట్లో విద్యుత్ సరఫరా మొత్తం ఆఫ్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

ఆస్పరి: మండలంలోని చిగిళిలో వెలసిన కట్టెల తిప్పన్న తాత ఉత్సవాలు ఆదివారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని భక్తులు కేరింతలు కొట్టారు. పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిప్పగిరి: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున ఆదివారం తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. రామదుర్గం గ్రామంలో నిర్వహించిన దాడులలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న గ్రామానికి చెందిన మాచనూరు బోయ నాగరాజును అరెస్ట్ చేసి అతని నుంచి 34 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

దాయాదుల మధ్య ఘర్షణ

వెల్దుర్తి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుక్కాపురం గ్రామంలో ఇంటి నిర్మాణంలో కిటికీ ఏర్పాటు విషయంపై దాయాదుల మధ్య ఆదివారం జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. కిటికీ నిర్మాణంపై పంచాయితీ చేస్తూ బంధువులు రెండు వర్గాలుగా విడిపోయి దాడులు చేసుకున్నారు. ఒక వర్గంలోని ఒకరికి రక్తగాయాలు, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వైరి వర్గంలోని ఐదుగురు తమపై పట్టుడు కర్రలతో దాడి చేశారని గాయపడ్డవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనల అతిక్రమణపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యంపై ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు నిబంధనలు ఉల్లంఘిస్తూ పట్టణంలో జీనియస్ గ్లోబల్ పేరుతో ప్రచారం చేస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను, అధికారులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా కళాశాలలో ఐఐటీ, జెఈఈ, నీట్ పేరుతో అడ్మిషన్లు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గుర్తింపు లేకుండా నడుపుతున్న కళాశాలపై ఇంటర్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు బాషా, వినోద్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాల కొరత



మండుటెండలో ఉపాధి పని చేస్తున్న కూలీలు

చిప్పగిరి: ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. వేసవికాలం కావడంతో ప్రమాదకర స్థాయిలో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించకపోవడంతో కూలీలు ఎండలోనే పని చేయాల్సివస్తోంది. వారి రక్షణ కోసం ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచడం, పని చేసే చోట నీడ ఏర్పాటు, దాహానికి ఉపశమనంగా మజ్జిగ ఇవ్వాల్సి ఉండగా అవన్నీ అందని ద్రాక్షగా మారాయి. మండలంలో 7,178 వరకు జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 14,114 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వ్యవసాయ పనులు ముగియడంతో మండలంలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి.13 పంచాయతీల పరిధిలో నిత్యం 5 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. ఎండల తీవ్రతకు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని పలువురు కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పిస్తే మరింత మంది కూలీలు పనులు వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం

ఉపాధి పనులు జరిగే ప్రాంతంలో కనీస వసతులైన ఫస్ట్ ఎయిడ్ బాక్స్, నీడ ఏర్పాటుతో పాటు కూలీలకు మజ్జిగ అందించేలా చర్యలు చేపడతాం. ఇందుకోసం ఉన్నతాధికారులకు వినతులు పంపాం. త్వరలోనే కూలీలకు ఆయా వసతులు అందుబాటులోకి వస్తాయి. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

– ఏపీడీ మల్లేశ్వరి

జోరుగా వరి కోతలు



చిన్నకొత్తిలిలో వరి కోత కోస్తున్న యంత్రం

నందవరం: ఆరు గాలం కష్టపడిన రైతన్నకు పంట పడింది. మంచి దిగుబడులు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రైతుకు అండగా నిలుస్తున్నాయి. రబీ సీజన్ పంటలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నది తీర ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమై జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్‌లో వరికి రూ.2,200 నుంచి రూ.3 వేల వరకు ధర లభించడంతో రబీ సీజన్‌లో అధికంగా రైతులు వరి సాగుపై మొగ్గు చూపారు. దీంతో నది ప్రాంతాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. యంత్రాల సవ్వడి.. కూలీల సందడితో నది తీర ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. మండలంలో రబీలో 2,250 ఎకరాల్లో వరి సాగైందని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. రైతులు ఎన్‌డీఎల్ ఎల్ఆర్, ఆర్ఎన్ఆర్, 555 వరి రకాలు ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం మండలంలోని నది తీర ప్రాంతాలైన నదికై రవాడి, నాగలదిన్నె, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురజాల గ్రామాలలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీల భారంతో రైతులు యంత్రాల ద్వారా వరి కోతలను ప్రారంభించారు. కోతలు పూర్తయిన రైతులు ధాన్యాలను కల్లాల్లోనే ఆరబోసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వరికి మద్దతు ధర రూ.2,200 నుంచి రూ.2,500 వరకు లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.